VINAYAKA VRATHA KALPAM_2024_CONMAG

రమాయణం

# జైజై గణేశా!!

**మా చిన్నప్పుడు వినాయకచవితి పండుగను ఇప్పటంత ఘనంగా చేసిన గుర్తులేదు. మా ఊళ్లో కూడా చాలా రోజులపాటు వీధుల్లో గణపతి మండపాలు వేసి, గణేశుని ప్రతిమలను నిలిపినట్లు నా జ్ఞాపకాల్లో లేదు. పండుగను సామూహికంగా కాకుండా.. ఎవరింట్లో వాళ్లు జరుపుకోవడమే!**

ఇప్పుడైతే.. నవరాత్రులంటే ఓ పెద్ద ఉత్సవం నిర్వహించడమే! పండుగకు ముందే చందాలు వసూలు చేయడం, ప్రసాదాలు, నైవేద్యాలు, మైకులు, డీజేలు, సెట్టింగులు, లైటింగులు, రకరకాల పోటీలు, బహుమతులు, నిమజ్జనానికి ఊరేగింపులు, డాన్సులు, ధూం ధామ్‌లు, వేలంపాటలు జరుపుతున్నారు. మాకు ప్రతి ఏడూ అవుసలి వాళ్లే మట్టి వినాయక ప్రతిమలు చేసి, ఇంటికి తీసుకొచ్చేవారు. చవితిరోజున పొద్దున్నే ఓ పెద్ద పళ్లెం నిండా నల్లరేగడి మట్టితో చేసిన వినాయకులు, మరో పళ్లెంలో బుల్లిబుల్లి ఎలుక బొమ్మల్ని తీసుకొచ్చి.. మేమిచ్చిన ఓ పళ్లెంలో ఒక వినాయకుడినీ, ఓ ఎలుకనీ పెట్టేవారు. 'అన్ని ఎలుకలూ, అందరు వినాయకులను ఒకే సైజులో ఎలా చేశారా!?' అని మాకు ఆశ్చర్యం వేసేది. ఇనుప సాంచాల్లో రేగడి మట్టి నింపి గట్టిగా ఒత్తితే.. ఆ సాంచా ఆకారం ఎలా ఉంటే అలా వస్తాయని మా నాన్న చెప్పాడు. భలే ముద్దుగా ఉన్న వాటినన్నిటినీ మనమే కొనుక్కుందామనీ, వాటితో బాగా ఆడుకోవచ్చనీ.. నేనూ, అక్కా ఓసారి ప్లాన్ చేసి నాన్ననడిగాం.

''అవ్వేమన్న బొమ్మలా?! ఒక వినాయకుణ్ని, ఒకే ఎలుకను తీసుకొని పూజ చేయాలె. మిగిలిన ఇండ్లల్ల ఇయ్యొద్దా!? వాండ్లు గూడ పూజ చేసుకోవాలె గద!'' అన్నాడు నాన్న. వినాయకుల్ని తెచ్చిన వాళ్లకు డబ్బులు, బియ్యం, కూరగాయలు, వంటసామాను ఇచ్చేవారు. చెట్లకొమ్మలు, ఆకులు, పండ్లతో పాలవెల్లిని చేసి దాని కింద పీటమీద వినాయకుణ్ని ఉంచి పూజ చేసేవాళ్లం.

మా ఇంట్లో బాగా చెట్లు ఉండటం వల్ల చుట్టుపక్కల వాళ్లతోపాటు ఊళ్లో చాలామంది మా ఇంటికి పత్రి కోసం వచ్చేవాళ్లు. అందులో ఎప్పుడూ మజ్జిగ కోసం వచ్చే వీరన్న కూడా ఒకడు. ''మా అమ్మ కొంచెం పత్తి ఇయ్యమన్నది!'' అంటూ వచ్చేవాడు. అతను వచ్చినప్పుడు నేనో, అక్కో ఇంటిముందు ఉంటే గనుక.. కొంచెం దూది (పత్తి) తెచ్చిచ్చి.. ''ఇది చాలా?! ఇంక కొంచెం ఇయ్యాల్నా?'' అనడిగేవాళ్లం అమాయకంగా.

వీరన్న తల గోక్కొని.. ''అయ్యో! గిదిగాదు అమ్మాయీ! పత్తి.. పత్తి.. అంటే అన్ని తీర్ల ఆకులు! గవ్విగావాలె! గన్‌పతి పూజల ఒస్తయి జూడు గవ్వి'' అనేవాడు.. మాకు అర్థం కాలేదనుకుని. ''ఓహో! పత్రి అంటె ఆకులు.. గవ్వా?! మరి వాటిలో నీకేం గావాలె?! అర్క , చూత, బదరీ, దాడిమీ, బిల్వ, మాచీపత్ర, దత్తూర, దూర్వాయుగ్మము, మరువకం, జాజి, తులసి, కరవీర..'' అంటూ అంతకుముందు రోజే వినాయక వ్రతకల్పం పుస్తకం చదివిన జ్ఞానంతో గడగడా చెబుతూ పోతుంటే.. ''ఏమో! నాకేం తెలుస్త లేదు. గీ పేర్లున్న చెట్లుంటయనే తెల్వదు!'' అనేవాడు. అతనికి పెద్దగా సంస్కృత భాషాజ్ఞానం లేనందుకు చింతించి.. ''పోనీ.. నీకు ఏ ఆకులు కావాల్నో తెలుగులో చెప్పు మరి?!'' అనేవాళ్లం వదలకుండా.

ఏది చెపితే ఏమంటామో.. అన్నట్లు బీరిపోయి చూసి.. ''మీ ఇంట్ల ఎవ్వి తెంపితె గండ్ల నుంచి గిన్నన్ని ఆకులు మాకు గూడ పెట్టరాదు(ని!'' అనేవాడు. ''ఓహో! అంతేనా?! పోనీ ఒక్క పేరు తెలుగులో చెప్పు!'' అంటూండగానే నాన్న అటువైపు వచ్చి.. ''ఏందయ్యా!? ఏం సంగతి!? ఏం గావాలె?!' అనడిగేవాడు. ''పత్తి గావాలె!'' అని మళ్లీ వీరన్న నాన్నను అడిగేవాడు. ''సరె.. తీస్కపో! మా ఇంట్ల ఉన్న చెట్లన్నిటి ఆకులు కొన్నికొన్ని తెంపుకొని పో!'' అని నాన్న చెప్పడమే ఆలస్యం.. వీరన్న బర బరా ఆకులన్నీ తెంపుకొనేవాడు. నానమ్మ చూస్తే.. ''ఏంది పిలగా? మాకు చెట్టు ఉంచుతవా లేదా? పీక్కపొయ్యి మీ ఇంట్లనే పెట్టుకో! మీ దగ్గర్నుంచే మేము తెచ్చుకుంటం!'' అనేది. మళ్లీ నాన్నతో.. ''గా కోమట్ల పిలగానికి ఆకులు తెంపుకోమని నువ్వే చెప్పినవా?! వాడిగ చెట్టు ఉంచుతడా?! గిన్ని ఆకులు పెడితె పోయేదానికి?!'' అనేది. నాన్న నవ్వి.. ''ఏ.. ఎన్ని తీస్కపోతడు!? గిన్ని ఆకులు అయితె అయి పాయె. పోనీ తియ్!'' అనేవాడు ఎప్పటిలాగే.

పొద్దున పూజ దగ్గర మా పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అన్నీ పెట్టేవాళ్లం. పూజ అయ్యాక మేమే కథ చదివేవాళ్లం. మొదట్లో ఒకటి రెండుసార్లు నాన్న చదివాడేమో.. అంతే! కథలో కొన్ని కఠినమైన పదాలు, కొంత గ్రాంథిక భాష ఉండటం వల్ల ఎక్కడన్నా తడుముకుంటే.. 'అది కూడా రాదా?!' అన్నట్టు అమ్మ తీవ్రంగా మావైపు చూసేది. వెంటనే నాలుక్కరుచుకుని సరిజేసుకునేవాళ్లం. మాకు ఎలాంటి కష్టమైన తెలుగైనా చదవడం వచ్చిందంటే అమ్మ వల్లనే! ఇప్పుడు ఎవరైనా పిల్లలకు తెలుగు చదవడం వచ్చా? లేదా? అని చూడాలంటే వినాయక వ్రతకథ పుస్తకం చదవమనాలి అనుకుంటుంటాం.

నాకెప్పుడూ ఓ డౌట్ వచ్చేది. ఎలుక అంత చిన్నగా ఉంటుంది కదా.. దానిమీద అంత లావు వినాయకుడు ఎలా ఎక్కుతాడు? అసలు ఎలుకను ఎందుకు పూజించాలి!?' అని! అవన్నీ అమ్మ వివరంగా చెప్పింది. ''ప్రకృతిల అన్ని జీవులూ ముఖ్యమే! మనిషొక్కడే కాదు.. అన్నీ బతుకాలె! వినాయకుడి రూపంల ఏనుగును కొలుస్తం, ఆయన వాహనమని ఎలుకను కొలుస్తం, కుమారస్వామి వాహనం నెమలి, విష్ణు వాహనం గద్ద, శివుడి వాహనం నంది, మెళ్లో ఏసుకునేది పాము, శని వాహనం కాకి, యముడి వాహనం దున్నపోతు, పార్వతి వాహనం పులి, సింహం, సరస్వతికి హంస, ఆండాళ్ భుజం మీద చిలుక, రాముడి బంటు కోతి.. పంచతంత్రం కథలన్నీ జంతువుల గురించే.. ఇట్ల అన్నిటికీ ప్రాధాన్యత ఇస్తెనే వాటిని చంపకుండ, హింసించకుండ ఉంటరని అట్ల చెప్పి ఉండవచ్చు'' అని అమ్మ చెప్పింది.

చాలా పత్రికలు అప్పట్లో వినాయక చవితికి ప్రత్యేక సంచికలు.. ముఖ్యంగా ఎక్కువ కార్టూన్లతో హాస్య ప్రధానంగా తీసుకొచ్చేవి. నేను తర్వాత కాలంలో కార్టూనిస్ట్‌ని అయ్యాక ఎక్కువ కార్టూన్లు వేసినా.. దేవుళ్లను కించపరిచేలా ఎప్పుడూ వేయలేదు. ■





నెల్లుట్ల రమాదేవి
రచయిత్రి